క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

టెక్కలి: స్థానిక ఆదిఆంధ్రావీధి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఈ.నరసింహకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. టెక్కలి టౌన్-3 ఫీడర్ పరిధిలో ఆంజనేయపురం, అడ్డుకొండ, వీఆర్‌కేపురం, నువ్వుగుడ్డి, మేఘవరం, పోలవరం, ఇండస్ట్రీయల్ ఫీడర్, సవరకిల్లి, గూడేం, నరసింగపల్లి, రాంపురం, సన్యాసి నీలాపురం, డమర, కిట్టాలపాడు, జగన్నాథపురం గ్రామాలతో పాటు ఆయా ప్రాంతాల్లో గ్రానైట్ క్వారీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలిగే విద్యుత్ సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

కవిటి: మండలంలో బొరివంక సబ్‌స్టేషన్ పరిధిలో ని మాణిక్యపురం ఫీడర్‌లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌డీఎస్‌ఎస్ పనులు నిర్వహించనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కవిటి మండల విద్యుత్‌శాఖ వర్గాలు తెలిపాయి. మాణిక్యపురం పరిసర గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అసౌకర్యం ఉంటుందన్నారు.

కాశీబుగ్గ: పలాస సబ్‌స్టేషన్‌లో విద్యుత్ నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉద యం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటలవరకు విద్యుత్ కోత విధించనున్నట్లు పలాస డివిజన్ వి ద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు బు ధవారం ప్రకటనలో తెలిపారు. పలాస నుంచి రెంటికోట గ్రామాల వరకు, పలాస-కాశీబుగ్గ జంట ప ట్టణాల్లోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరా యం ఉంటుందని, ప్రజలుగమనించాలని కోరారు.

వ్యాయామంతో మానసిక ఉల్లాసం

ఇచ్ఛాపురం: వ్యాయామంతో మానసిక ఉల్లాసం లభిస్తుందని నియోజకవర్గ క్రీడా ఇన్‌చార్జి కె.పద్మనాభం రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో మండల క్రీడా ఆర్గనైజర్ పి.కృష్ణ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ప్రతీ విద్యార్థి వ్యాయామ కార్యకలాపాల్లో పాల్గొనేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండంలోని వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా వెంకటరావు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా ఎల్.వెంకటరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ విస్తీర్ణాధికారిగా పని చేసిన ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు ఆయనకు స్వాగతం పలికారు.

మళ్లీ మొదలైన మున్సిపల్ కార్మికుల సమ్మె

కాశీబుగ్గ: గతంలోని సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ బుధవారం నుంచి మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ సమ్మెకు దిగారు. ప్రభుత్వం పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పరిష్కరించలేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.వెంకట్, సీహెచ్ మురగన్, ఎం.రవి మాట్లాడుతూ గత సమ్మెలో అంగీకరించిన ఒప్పందాలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎస్.శంకర్, ప్రకాష్ ముఖి, ఎస్.రమేష్, బాలకృష్ణ, తిరుపతి, గులాబీ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ఇచ్ఛాపురం: ఎరువుల విక్రయాల్లో పారదర్శకత, నాణ్యత పాటించాలని ఏడీఏ టి.భవానీ శంకర్‌రావు సూచించారు. పట్టణంలోని పలు ప్రైవేటు ఎరువుల విక్రయ దుకాణాల్లో ఎంఏవో అజయ్ కుమార్‌తో కలిసి ఆకస్మిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఎరువుల నిల్వ రిజిస్టర్, విక్రయ రిజిస్టర్లను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. షాపుల వద్ద ధరల వివరాల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

సోంపేట: మహిళలు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన అవసరమని సీఐ బి.మంగరాజు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు శక్తియాప్ గురించి బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

- ప్రధాన కూడళ్లలో నిలుపుతున్న భారీ వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- చర్యలు తీసుకోవాలని వేడుకోలు

లారీలు ఇలా.. రాకపోకలు ఎలా..?

బైరిపురం జంక్షన్‌లో రోడ్డు పక్కనే పార్క్ చేసిన వాహనాలు



కంచిలి:

మండలంలో ప్రముఖ వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్న జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ప్రధాన కూడళ్లలో భారీ వాహనాలు పార్కింగ్ చేస్తుండడం వలన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. నిత్యం వందలాది సంఖ్యలో అన్ని రకాల వాహనాలు రాకపోకలు సాగించే కూడళ్లలో పరిస్థితి దారుణంగా తయారైంది. ముఖ్యంగా బైరిపురం జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డులో ఒకవైపు వరుసగా ఉన్నటువంటి హోల్‌సేల్ కూరగాయల దుకాణాల ముందు ఉదయం నుంచి రాత్రి వరకు అన్నివేళల్లో భారీ వాహనాలు ఉంటున్నాయి. కూరగాయలు తీసుకొచ్చి అన్ లోడింగ్ చేయడం, వాటి నుంచి నేరుగా చిన్న వాహనాల్లోకి లోడింగ్ చేయడం వంటి ప్రక్రియ ఇక్కడ నిత్యం జరుగుతోంది. ఈ కూరగాయల షాపులు ఈ జంక్షన్ నుంచి ఆదివారం సంతకూడలి వరకు రోడ్డు పొడవునా ఉన్నాయి.

నిత్యం రాకపోకలు

బైరిపురం జంక్షన్ మీదుగా మండలానికి చెందిన సుమారు 30 గ్రామాలతో పాటు, అవతల సరిహద్దు ఒడిశా వైపు ఉన్న గ్రామాల ప్రజలు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా ఇక్కడ భారీ వాహనాలు పార్కింగ్ చేయడం వలన అయోమయానికి గురవుతున్నారు. అదేవిధంగా ఆదివారం సంత కూడలి వద్ద సర్వీసు రోడ్డులో అరటి పండ్ల హోల్‌సేల్ వ్యాపారులు లారీలతో అన్ని రోజుల్లోనూ సరుకును తీసుకొచ్చి, రోడ్డు పక్కనే వేలాది అరటి గెలలను పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ అమ్మకాలు సాగించిన క్రమంలో వాటి ఆకులను రోడ్డు పక్కనే కుప్పలుగా పోసి విడిచిపెట్టేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ కూడా లారీలు రోడ్డుమీదే నిలిపి అన్ లోడింగ్ చేయడం, ఆ సరుకును చిన్న వాహనాల్లో లోడింగ్ చేసే ప్రక్రియ అన్ని రోజుల్లోనూ జరుగుతోంది. దీని వలన కేసరపడ, ఎక్కల, అర్జునాపురం, సమీప ఒడిశాకు చెందిన గ్రామాల ప్రజలు, ఉద్దాన గ్రామాలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన భారీ వాహనాలను రోడ్డు పక్కనే ఆపేయకుండా, రాత్రిపూట మాత్రమే లోడింగ్, అన్ లోడింగ్‌లు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



సర్వీసు రోడ్డుపై అరటి గెలల అమ్మకాలు సాగిస్తున్న వ్యాపారులు

భారీ వాహనాలతో అవస్థలు



బైరిపురం జంక్షన్‌లో ప్రతి రోజు భారీ వాహనాలు అన్ని వేళల్లో రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడం వలన వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కేవలం రాత్రిపూట మాత్రమే ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియలు చేపట్టాలి. ఈవిధంగా చర్యలు తీసుకోవాలి.

– మద్ది ఆదినారాయణ, కొత్తపురం గ్రామం, కంచిలి

సమస్యను సరిదిద్దుతాం



బైరిపురం జంక్షన్, ఆదివారం సంత కూడళ్లలో భారీ వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేయడం వలన ఆ కూడళ్ల మీదుగా రాకపోకలు సాగించే మిగతా వాహనదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు చేపడతాం. ట్రాఫిక్ సమస్యను కూడా సరిదిద్దుతాం.

– పి.పారినాయుడు, ఎస్ఐ, కంచిలి

మర్యాదపూర్వక భేటీ



మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టెక్కలి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులు, బలో పేతంపై మాట్లాడినట్లు తెలియ జేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. – టెక్కలి

సర్వే వేగవంతం చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపడుతున్న పీ-4 సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి టి.భవానీశంకర్ సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందిని గుర్తించి పేదరికాన్ని దూరం చేయడమే లక్ష్యంగా ఇంటింటా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో కె.రామారావు, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు, మండల వ్యవసాయాధికారి పీపీవీవీ అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే గురించి వివరిస్తున్న ప్రత్యేకాధికారి భవానీశంకర్

మహిళల భద్రతపై అవగాహన

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రతపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే నారీశక్తి కార్యక్రమం ఉద్దేశమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని మండపల్లిలో రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో నారీ శక్తి ఫ్లెక్సీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళల భద్రత, శక్తి యాప్ ఆవశ్యకత, ఉపయోగం, ప్రయోజనం గురించి వివరించారు. అనంతరం రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ ధర్మపురం ఉన్నత పాఠశాలలో సామాజిక మాధ్యమాలు ద్వారా జరుగుతున్న వేధింపులు, సైబర్ మోసాలపై అప్రమత్తత, మహిళా చట్టాలు, బాల్య వివాహాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన క ల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

చంద్రబాబు మోసాలను గుర్తు చేద్దాం

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు
- మందసలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

మందస: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు గుర్తు చేద్దామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గ సమన్వయకర్త సీదిరి అప్పలరాజు పిలుపునిచ్చారు. మందస మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా, ఒక్క హామీ కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు సూపర్ 6 పేరుతో మొత్తం 143 హామీలు ఇచ్చినప్పటికీ, అమలు చేయకుండా కారణాలు చెబుతున్నారని మండిపడ్డారు. తల్లి వందనం పథకం కోసం సూమారు రూ.13 వేల కోట్లు అవసరమవ్వగా, బడ్జెట్‌లో రూ.8,300 కోట్లు కేటాయించి సూమారు 25 లక్షల మంది విద్యార్థులకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు నెలకు రూ. 1,500, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు.



రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అభివృద్ధి ఘనత వైఎస్సార్‌సీపీదే..

పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో 150 ఎకరాల్లో జగనన్న లే అవుట్ వేసి అభివృద్ధి చేశామని తెలియజేశారు. మందస కేంద్రంలో రోడ్లు, లైట్లు వేయించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. వీటితో పాటు కిడ్నీ అస్పత్రి, రీసెర్చ్ సెంటర్, గ్రామాలకు రోడ్లు తదితర అభివృద్ధి పనులు విరివిగా చేపట్టామన్నారు. దామోదర్ సాగర్‌పై మినీ రిజర్వాయర్‌కు సంబంధించిన పనులు కొనసాగించడానికి ప్రస్తుత ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని మండిపడ్డారు. సమావేశంలో మందస మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డి.జానకిరావు, జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, నాయకులు చింతాడ గణపతి, కర్రి గోపాల్, బత్తిని లక్ష్మణరావు, సిందిరి జగన్, శానపతి కిషోర్, అందాల శేషగిరిరావు, శానపతి దివ్యమురళి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిద్దాం

- ఈ ప్రాంతానికి కింజరాపు కుటుంబం చేసిన మేలేంటి..?
- ధ్వజమెత్తిన పేరాడ తిలక్
- కోటబొమ్మాళిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

టెక్కలి:

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబు ఏడాది కాలంగా చేస్తున్న మోసాలను ప్రజలకు వివరిద్దామని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ పిలుపునిచ్చారు. కోటబొమ్మాళిలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తత స్థాయి సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందర్‌రాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేద్దామన్నారు. టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎంతో బలంగా ఉన్నారని, కష్టకాలంలో కోటబొమ్మాళి మండల కార్యకర్తలు ఎంతగానో పార్టీకి అండగా నిలిచారని గుర్తు చేశారు. గ్రామాల్లో అధికార పార్టీ కార్యకర్తలు చేస్తున్న తప్పులను ఫోన్‌లో వీడియో తీసి సమాజానికి తెలియజేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కోటబొమ్మాళి మండలంలో భూ కబ్జాలు, ల్యాండ్ మాఫియా, మైనింగ్ అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న దోపిడీకి అండగా నిలుస్తున్న కొంతమంది అధికారులను వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. కోటబొమ్మాళి మండలాన్ని పర్యాటక కేంద్రం చేస్తామని మంత్రి ఇచ్చిన హామీకి ఏడాది గడిచినా, ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. మూలపేట పోర్టు ఏర్పాటుతో మన ప్రాంతంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన అభివృద్ధి మార్క్ చూపించారని, దశాబ్దాలుగా ఏలుతున్న కింజరాపు కుటుంబం ఈ ప్రాంతం కోసం ఏం చేశారని నిలదీశారు. ఈనెల 21వ తేదీలోగా గ్రామ కమిటీల నియామకాలు పూర్తి చేయాలన్నారు. అలాగే పంచాయతీ ఇన్‌చార్జిలతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరించారు.



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న పేరాడ తిలక్

కక్ష సాధింపులు తప్ప.. అభివృద్ధి ఎక్కడుంది

పార్టీ మండల కన్వీనర్ ఎస్.హేమసుందర్‌రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు చర్యలు తప్ప.. అభివృద్ధి, సంక్షేమం ఎక్కడుందని ప్రశ్నించారు. టెక్కలి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, రాష్ట్రానికి వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు రైతులకు, ఈ ప్రాంతానికి ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో యాక్టివ్‌గా ఉన్న కార్యకర్తలతో సోషల్ మీడియా వేదికగా గ్రూప్‌ను తయారు చేసి గ్రామాల్లో ప్రతీ సమస్యను ఇన్‌చార్జి తిలక్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కింజరాపు కుటుంబం నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని తెలియజేశారు. గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై చేస్తున్న వేధింపులపై అంతా కలిసికట్టుగా తిరుగుబాబు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. బీసీ సెల్ అధ్యక్షుడు కళ్లి విశ్వనాథం మాట్లాడుతూ.. కోటబొమ్మాళిలో టీడీపీ నాయకుడు చెరువును కబ్జా చేస్తుంటే మంత్రి అచ్చెన్నాయుడు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఆ కబ్జాలో మంత్రి వాటా ఎంతని ప్రశ్నించారు. సోషల్ మీడియా అధ్యక్షుడు పిట్ట శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తనను కూలి పనులు కూడా చేసుకోకుండా గ్రామాల్లో ఆంక్షలు విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు రెచ్చిపోయిన టీడీపీ నాయకులు.. ఇప్పుడు రాష్ట్రంలో ఘోరంగా పాలనా వైఫల్యంతో చతికిలపడిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దుబ్బ వెంకట్రావు, సర్పంచ్ కె.సంజీవ్, నాయకులు ఆర్.మల్లయ్య, డి.రామకృష్ణారెడ్డి, పి.మోహన్‌రావు, బి.వెంకటరమణ, ఎస్.వినోద్, ఎన్.సత్యరాజ్, కె.రామరాజు, సీహెచ్.అప్పలరాజు, పి.వెంకట్రావు, ఎస్.జనార్ధనరావు, బి.దివాకర్, బి.అప్పన్న, పి.శ్రీనివాస్, ఆర్.లక్ష్మణరావు, ఎస్.అప్పలస్వామి, డి.సిమ్మన్న, ఎం.జగన్నాథం, కె.విశ్వనాథ్‌రెడ్డి, కె.గణపతిరావు, జి.నాగభూషణరావు ఆర్.శివారెడ్డి, టి.గణపతి, హెచ్.గిరి, హెచ్.గోవిందరావు, బి.ఎల్లయ్య, పి.రామమ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలి



ఇచ్ఛాపురం టౌన్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



సోంపేట: మానవహారం నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు



కాశీబుగ్గ: ర్యాలీలో మాట్లాడుతున్న జడ్జి మాధురి

సోంపేట: మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకుని ఇరువర్గాలు లాభపడాలని సోంపేట కోర్టుల సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు, జూనియర్ సివిల్ న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు సూచించారు. మధ్యవర్తిత్వం – దేశం కోసం కార్యక్రమంలో భాగంగా సోంపేటలో బుధవారం మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో సోంపేట బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శైలేంద్ర, సీఐ బి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని జడ్జి యు.మాధురి సూచించారు. మధ్యవర్తిత్వం – దేశం కోసం కార్యక్రమంలో భాగంగా పలాస మండల న్యాయసేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు తరపున ప్రత్యేక ర్యాలీ పలాసలో బుధవారం చేపట్టారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఫయాజ్, ఉపాధ్యక్షుడు బీకేఆర్ పట్నాయక్, సీనియర్ న్యాయవాదులు వి.రవి, అనిల్ రాజు, మురళీమోహన్, విశ్వేశ్వరరావు, రజని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించుకోవాలని కోరుతూ న్యాయవాదులు, పోలీసులు, పారాలీగల్ వాలంటీర్లు పట్టణంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్జి పి.ఫరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పల్లిసారధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అండమాన్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బయ్య కృష్ణారావు తన తల్లిదండ్రులు బొడ్డేను, సావిత్రమ్మల జ్ఞాపకార్థంగా సుమారు రూ.15 వేలు విలువ గల ప్రింటర్‌ను వితరణగా అందించారు. ఈ మేరకు బుధవారం పాఠశాల హెచ్‌ఎం వై.కాంతారావుకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్తిని కుసుమ, పీఎంసీ చైర్‌పర్సన్ దున్న కవిత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులు గౌరవమివ్వాలి

సోంపేట: బ్యాంకు అధికారులు మహిళలు, సెర్ప్ సిబ్బందికి గౌరవమివ్వాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో ఆరు మండలాల బ్యాంకు మేనేజర్లు, డీపీఎం, ఏపీఎం, సీసీలతో సమావేశం బుధవారం నిర్వహించారు. బ్యాంకులకు ఎక్కువ వ్యాపారం స్వయం శక్తి సంఘాల ద్వారా జరుగుతుంది కావున, వారిని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. సంఘం పొదుపులో 50 శాతం సొమ్ము సభ్యుల అంతర్గత అవసరాలకు అందజేయాలన్నారు. సమావేశంలో డీపీఎంలు బి.నారాయణరావు, నాగలక్ష్మి, ఏపీఎంలు ఎస్.ప్రసాదరావు, గోవిందరావు, జాంబవతి, అప్పలనరసమ్మ, జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నేడు

పలాస: కాశీబుగ్గలోని కీర్తన ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం 3 గంటలకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్న ట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దువ్వాడ రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొనన్నట్లు వెల్లడించారు. పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

20న విస్తృత స్థాయి సమావేశం

టెక్కలి: ఈనెల 20న టెక్కలిలో మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ హనుమంతు వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సత్తారు సత్యం తెలియజేశారు. ఈ మేరకు టెక్కలి పార్టీ కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. టెక్కలి వైఎస్సార్ జంక్షన్ సమీపంలోని శుభం కన్వెన్షన్ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వీరితో పాటు పార్టీ పెన్షనర్స్ అండ్ విశ్రాంత ఉద్యోగుల విభాగం అధ్యక్షుడు మోదుగువలస గణపతిరావు, నాయకులు కిల్లి అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



కవిటి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్



టెక్కలి: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సమావేశాలు జయప్రదం చేయండి

కవిటి: మండల స్థాయిలో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ విస్తృత స్థాయి సభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని బల్లిపుట్టుగలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా విజయ నివాసంలో ఈ మేరకు మీడియా సమావేశం బుధవారం నిర్వహించారు. ఈనెల 19వ తేదీన కంచిలి మండలానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో సమావేశం ఉంటుందన్నారు. 20వ తేదీ ఉదయం అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపం భవనం ఆవరణలో కవిటి మండల సమావేశం, అదేరోజు మధ్యాహ్నం శైలజ కల్యాణ మండపంలో సోంపేట మండ ల సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సమావేశాల్లో ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ నేతలు కడియాల ప్రకాష్, వై.నీలయ్య, దుద్ది ధర్మారావులు ఉన్నారు.

కాశీబుగ్గ: బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమం విజయవంతం చేయాలని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శిష్టు గోపి కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి సంబంధించి ఈనెల 19వ తేదీన జరగనున్న సమావేశం విజయవంతం చేయాలని కోరారు.